సీనియర్ ఫ్యాకల్టీని కొనసాగించాల్సిందే

- అవగాహన లేని నూతన టీచర్లతో బోధన సరికాదు
- గురుకులంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- సమస్యలను పరిష్కరించాలని అడిగితే వేధింపులా.?
- గౌలిదొడ్డి గురుకుల కళాశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

కొండాపూర్, సెప్టెంబర్ 20: గతంలో కొనసాగిన కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను కొనసాగించాలని, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, ఉపాధ్యాయులకు సక్రమంగా వేతనాలు చెల్లించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. శుక్రవారం శేరిలింగంపల్లి పరిధిలోని గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ఎదుట ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం, పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఉపాధ్యాయులను తొలగించడం, ఉత్తమ ఉపాధ్యాయులను విద్యా సంవత్సరం మధ్యలో మార్చడం కారణంగా విద్యార్థుల చదువుకు ఇబ్బంది కలుగుతుందని వాపోయారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ... కళాశాల ఉపాధ్యాయులను బదిలీ చేయడంతోపాటు కాంట్రాక్టు పద్ధతిలో ఎనిమిదేండ్లుగా కొనసాగుతున్న సబ్జెక్ట్ టు అసోసియేట్స్‌ను తొలగించారని పేర్కొన్నారు. వారి స్థానంలో వచ్చిన కొత్తవారికి కనీస అవగాహన లేకపోవడంతో విద్యార్థులు చదువుల్లో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం వేధిస్తున్నదని పేర్కొన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తున్న విద్యార్థులను కళాశాల ఉన్నతాధికారులు టార్గెట్ చేస్తున్నారని, తమ పిల్లలకు ఏమైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

శేరిలింగంపల్లి పరిధిలోని గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ఎదుట ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం, పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

చెరువుల మ్యాపులు తప్పుల తడక

మొదటిపేజీ తరువాయి...

హెచ్ఎండీఏ నిర్లక్ష్యం చూపుతున్నదని పౌరహక్కుల నేత లుబ్నా సార్వత్ ఆరోపించారు. చెరువులను పరిరక్షించే బాధ్యతను భుజాన వేసుకున్న హెచ్ఎండీఏ.. ఆ విధులను నిర్వర్తించడంలో విఫలమవుతున్నదని ధ్వజమెత్తారు. యాదాద్రి భువనగిరి జిల్లా అనాజీపూర్ గ్రామ పరిధిలో ఉండే పెద్ద చెరువు (లేక్ ఐడీ-3354)కు 2015లో ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేయగా, ఇప్పటివరకు తుది నోటిఫికేషన్ ఎందుకు జారీ చేయలేదని ప్రశ్నించారు. ప్రిలిమినరీ నోటిఫికేషన్‌లో పేర్కొన్న వివరాలు తప్పులుగానే ఉన్నాయని ఆరోపించారు. తుర్కయంజాల్ మాసబ్ చెరువు (లేక్ ఐడీ 1954), బాలానగర్‌లోని సున్నం చెరువు (లేక్ ఐడీ 4805) వివరాలు కూడా తప్పులుగానే ఉన్నాయని పేర్కొన్నారు. హెచ్ఎండీఏ లేక్స్ వెబ్‌సైట్‌లో 2,569 చెరువుల ఎఫ్‌టీఎల్, క్యాడస్ట్రల్ మ్యాపులను సరిచూసుకోవాలని, వాస్తవాలకు భిన్నంగా మ్యాపుల్లో మార్పులు ఉన్నట్టుగా అనుమానాలను వ్యక్తం చేశారు. కొన్ని చెరువుల మ్యాపులు అందుబాటులోనే లేకుండా పోయినట్టుగా తెలిపారు. ఆ జాబితాలో గండిపేటకు సమీపంలోని మంచిరేవుల వద్ద ఉండే నాగిరెడ్డి కుంట లేకుండానే పోయిందని ఆరోపించారు.

తిరుమల లడ్డూపై దుమారం

- కల్తీ నెయ్యిపై దేశవ్యాప్త చర్చ
- 100రోజుల పాలన, ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి మళ్లించేందుకే చంద్రబాబు కట్టుకథ : మాజీ సీఎం జగన్
- నాణ్యత లోపం నిజమే: టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడి
- భక్తుల విశ్వాసాన్ని తగ్గించే కుట్ర: కేంద్ర మంత్రి బండి సంజయ్

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై వివాదం దేశ వ్యాప్తంగా దుమారం రేపుతున్నది. లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు ఆనవాళ్లు ఉన్నాయంటూ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలతో వివాదం మరింత ముదిరింది. దీంతో రాజకీయ పార్టీల మధ్య వార్ కొనసాగుతున్నది. తాజాగా శుక్రవారం పలువురు రాజకీయ ప్రముఖులు, నేతలు స్పందించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): వైసీపీ ప్రభుత్వ హయాంలోనే లడ్డూ తయారీకి జంతువుల కొవ్వును ఉపయోగించారంటూ సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణలను ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తప్పుబట్టారు. దేవుడ్ని కూడా రాజకీయాలకు వాడుకునే దుర్మార్గమైన మనస్తత్వం చంద్రబాబుది అంటూ జగన్ ఆరోపించారు. చంద్రబాబు చెబుతున్నదంతా ఓ కట్టుకథగా అభివర్ణించారు. నెయ్యి శాంపిళ్లపై రెండు నెలల కిందటే నివేదిక వస్తే ఇన్ని రోజులు ఏం చేశారని చంద్రబాబును ప్రశ్నించారు. వందరోజుల పాలన, సూపర్ సిక్స్ హామీల అమలుపై టీడీపీ కూటమిని ప్రజలు ప్రశ్నిస్తారనే చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.

- తిరుమల లడ్డూ నాణ్యతపై కొంతకాలంగా భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని ఈవో జె.శ్యామలరావు శుక్రవారం తెలిపారు. తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత జూలై 6, 12తేదీల్లో నెయ్యిని ల్యాబ్‌కి పంపినట్లు తెలిపారు. ఏఆర్ డెయిరీ సరఫరా చేసిన నెయ్యిలో నాణ్యత లేదని టెస్టుల్లో తేలిందని వెల్లడించారు.
- లడ్డూ వివాదం హిందువుల మనోభావాలను కలిచి వేస్తున్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. టీటీడీపై భక్తుల విశ్వాసాన్ని సడలించేందుకు కుట్ర చేశారని మండిపడ్డారు. సీబీఐతో విచారణ జరిపించాలని సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు.
- భారత ప్రధాన న్యాయమూర్తికి జర్నలిస్టు సురేశ్ హాన్కే న్యాయవాది ద్వారా లేఖ రాశారు. ఈ వ్యవహారంలో తక్షణమే సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని తగిన ఆదేశాలు జారీచేయాలని విజ్ఞప్తిచేశారు.
- ప్రసాదాల నాణ్యతపై గతంలో టీటీడీ చైర్మన్, ఈవో దృష్టికి తీసుకెళ్లానని టీటీడీ మాజీ ప్రధాన అర్చకుడు రమణ దీక్షితులు అన్నారు. ఆవు నెయ్యిని కల్తీ చేయడం దారుణమైన విషయమన్నారు.
- టెస్టుల్లో ఎలాంటి లోపాలు లేవని తేలినట్టు ఏఆర్ డెయిరీ యాజమాన్యం ప్రకటించింది. కానీ, తమ సంస్థపై విష ప్రచారం చేస్తున్నారని పేర్కొంది.
- లడ్డూ ప్రసాదంపై ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమేనని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టంచేశారు. ఆరోపణలపై తాను కుటుంబంతో సహా ప్రమాణం చేస్తానని, చంద్రబాబు కూడా ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు.
- దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సినీనటుడు ప్రకాశ్‌రాజ్.. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ఎక్స్ వేదికగా కోరారు.
- తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని సీపీఐ సీనియర్ నేత నారాయణ కోరారు.

నెయ్యి టెండర్లు జరిగింది ఇలా..

నెయ్యి కొనుగోలుకు టీటీడీ 2024 మార్చి 12న టెండర్ వేసినట్లు పేర్కొంది. మే 8న టెండర్ ఖరారైంది. ఆ తర్వాత తమిళనాడుకు చెందిన ఏఆర్ డెయిరీకి ఈ ఆర్డర్ వచ్చింది. కంపెనీ స్వచ్ఛమైన ఆవు నెయ్యి కిలో ధర రూ.319గా పేర్కొన్నది. జూలై 6 – జూలై 12 మధ్య నాలుగు, జూలై 15 నుంచి ఆగస్ట్ 6వ తేదీ వరకు 6ట్యాంకర్లను పంపింది. జూలై 6, 12 తేదీల్లో పంపిన ట్యాంకర్ల నమూనాల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించింది. గుజరాత్‌లోని నేషనల్ డెయిరీ ల్యాబ్‌కు శాంపిళ్లు పంపి మిగతా ట్యాంకర్లను నిషేధించారు.

తిరుమల లడ్డూకు 300 ఏండ్ల చరిత్ర

తిరుమల శ్రీవారి ప్రసాదంగా లడ్డూ పంపిణీ సుమారు 300 ఏండ్ల కిందటే ప్రారంభమైంది.1715 ఆగస్టు 2న తొలిసారిగా లడ్డూను తిరుమల ప్రసాదంగా భక్తులకు అందించినట్టు చరిత్ర చెబుతోంది. 2010 వరకూ రోజుకు లక్ష వరకూ లడ్డూలను తయారు చేసేవారు. ఆ తర్వాత భక్తుల రద్దీకి అనుగుణంగా రోజుకు 3.20 లక్షల లడ్డూలను తయారుచేస్తున్నారు. లడ్డూకు 2014లో జీఐ గుర్తింపుతోపాటు పేటెంట్, ట్రేడ్‌మార్క్ రిజిస్టర్ కావడం విశేషం.

అమృత్ స్కీం.. టెండర్ల స్కాం

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వం అయా కంపెనీలకు టెండర్లు కట్టబెట్టిందని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం టెండర్ల విషయాన్ని, వాటిని దక్కించుకున్న కంపెనీల వివరాలను మున్సిపల్ శాఖతో పాటు ఇతర ఈ టెండరింగ్ వెబ్ సైట్లలోనూ లేకుండా కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నదని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక విమర్శలు చేసిన రేవంత్‌రెడ్డి, మేఘా కంపెనీ టెండర్లను దాదాపు 40 శాతానికి పైగా అంచనాలు పెంచారనే ఆరోపణలున్నాయని లేఖలో ప్రస్తావించారు. అమృత్ టెండర్ల విషయంలో సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తి గోప్యంగా ఉంచుతున్న నేపథ్యంలో కేంద్రం జోక్యం చేసుకొని వివరాలన్నీ బహిర్గతం చేసి మొత్తం వ్యవహారాన్నంతా పారదర్శకంగా ఉంచాలని కోరారు.

లేదంటే రేవంత్‌కు కేంద్రం వత్తాసు పలికినట్టే

సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది సృజన్ రెడ్డికి చెందిన శోధ కంపెనీ ఇతర కంపెనీలతో కలిసి రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ ప్రాజెక్టుల కాంట్రాక్టులను ఎలాంటి అర్హతలు లేకున్నా దక్కించుకుంటున్న వైనాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ ఎత్తిపోతల కాంట్రాక్టులను సృజన్‌రెడ్డి కంపెనీతో పాటు గతంలో రేవంత్‌రెడ్డి అనేక ఆరోపణలు చేసిన మేఘా కంపెనీ, కేఎన్ఆర్ కంపెనీలకు అప్పగించారని పేర్కొన్నారు. కేఎన్ఆర్ కంపెనీలో సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి వాటాలు ఉన్నాయన్న విషయాన్ని గుర్తించాలన్నారు. రాష్ట్రంలో తొమ్మిదినెలల కాలంలో పురపాలక శాఖ పరిధిలో జరిగిన అన్ని టెండర్లలోనూ ప్రత్యేకించి కేంద్రం నిధులతో కొనసాగే కార్యక్రమాల టెండర్ల విషయంలో నిజాలు నిగ్గు తేల్చాలని కోరారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌తోపాటు, స్థానిక బీజేపీ ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నా స్పందన లేదని, సీఎం రేవంత్‌రెడ్డి పాల్పడుతున్న అవినీతిలో కేంద్ర భాగస్వామ్యం ఉన్నదని భావించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

రాష్ట్ర సాధన పోరులో 'కొండా'ది కీలకపాత్ర

లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కొండా లక్ష్మణ్ బాపూజీది కీలకపాత్ర అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 1969లో మంత్రి పదవిని సైతం వదులుకున్న త్యాగధనుడు అని కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం ఆయన సేవలను సీఎం స్మరించుకున్నారు. నిజాం వ్యతిరేక పోరులో ఓ వైపు పాల్గొంటూనే, మరోవైపు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వందేమాతరం, క్విట్ ఇండియా ఉద్యమాల్లోనూ బాపూజీ భాగస్వామి అయ్యారని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా వివిధ హోదాల్లో ప్రజలకు సేవ చేయటంతో పాటు బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి బాపూజీ తపించారని పేర్కొన్నారు.

కొత్త జూపార్క్ ఏర్పాటుపై అధ్యయనం

- 'వన్‌తారా'ను సందర్శించిన అటవీశాఖ అధికారులు
- రెండు వారాల్లో ప్రభుత్వానికి నివేదిక
- కొత్త జూపార్క్ అవసరం లేదు: పద్మనాభరెడ్డి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కొత్తగా నిర్మించనున్న ఫోర్త్‌సిటీలో కొత్త జూపార్కును ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో రాష్ట్ర అటవీ అధికారుల బృందం రెండ్రోజుల క్రితం గుజరాత్ జామ్‌నగర్‌లోని 'వన్‌తారా' జంతు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించింది. వివిధ అంశాలపై అధ్యయనం చేసిన అధికారులు నివేదికను రూపొందించారు. జూపార్క్ ఏర్పాటు లక్ష్యం, జంతువులు, వాటి సంరక్షణ కోసం చేపట్టాల్సిన సౌకర్యాలపై అధ్యయనం చేశారు. రెండు వారాల్లో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఓ సీనియర్ అటవీ అధికారి తెలిపారు.

200 ఎకరాల్లో జూపార్క్..

ప్రభుత్వ ప్రతిపాదిత ఫోర్త్‌సిటీ చుట్టుపక్కల సుమారు 18 వేల ఎకరాల అటవీ ప్రాంతం ఉంది. తాడిపర్తి, మద్విన్, కురుమిద్ద, కడ్తాల్, నాగిలి అటవీ బ్లాకుల పరిధిలో 15 వేల ఎకరాల అటవీ భూమి ఉంది. గుమ్మడవెల్లి అటవీబ్లాక్‌లో మరో 2 వేల ఎకరాల రిజర్వ్ అడవి ఉంది. ఈ అటవీ బ్లాకులకు ఆనుకుని ఉండే రెవెన్యూ భూమిలో జూపార్కు ఏర్పాటుకు ప్రభుత్వం సూత్రపాయంగా నిర్ణయించింది. ఫోర్త్‌సిటీలో 200 ఎకరాల్లో జూపార్కు ఏర్పాటుచేసి దానికి అనుబంధంగా వెయ్యి ఎకరాల అటవీ ప్రాంతాన్ని గ్రీన్‌బెల్టుగా చూపాలని భావిస్తున్నది. ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే నిధులు, నిర్వహణను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ఏర్పాటుచేయాలని భావిస్తున్నది. కాగా కొత్త జూపార్క్ ఏర్పాటు ప్రతిపాదనను ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి వ్యతిరేకిస్తున్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై అధికారుల పక్షపాతం

- క్యాంప్ ఆఫీసులో చెక్కుల పంపిణీకి అనుమతి నిరాకరణ
- మండల ఆఫీసుకే రావాలని మాధవరం కృష్ణారావుకు సూచన
- తన ఇంటి వద్దనే చెక్కులు పంపిణీ చేసిన అరికెపూడి గాంధీ

కూకట్‌పల్లి మండల ఆఫీస్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

వివేకానందనగర్‌లోని తన నివాసంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 20: ప్రొటోకాల్ పాటించే విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధుల విషయంలో పక్షపాతం చూపొద్దని నిబంధనలు పేర్కొంటున్నా రాష్ట్రంలో అధికారులు, పోలీసుల వైఖరిలో మార్పు రావడం లేదు. మొన్నటికి మొన్న కాంగ్రెస్‌లో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, బీఆర్ఎస్ శాసనసభ్యుడు కౌశిక్ రెడ్డి మధ్య వివాదం విషయంలో చూపిన పక్షపాత వైఖరిపై పోలీసులు విమర్శలు ఎదుర్కొనగా.. తాజాగా మండల రెవెన్యూ అధికారులు అదే వైఖరిని అవలంబించారు. కూకట్‌పల్లి మండలంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ వివాదాస్పదమైంది. కూకట్‌పల్లి మండల పరిధిలో ఇటు శేరిలింగంపల్లి, అటు కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. లబ్ధిదారులకు గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయాల్సి ఉండగా, మండల అధికారులు ఒకరోజు ముందుగానే కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఆహ్వానం పంపించారు. మండల కార్యాలయంలోనే చెక్కుల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. కూకట్‌పల్లిలోని క్యాంప్ ఆఫీస్‌లో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తానని, అందుకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే కృష్ణారావు అధికారులను కోరారు. అలా కుదరదని, మండల ఆఫీస్‌లో నిర్వహించే వేదికపైనే ఇవ్వాలని తేల్చిచెప్పారు. దీంతో మండల కార్యాలయంలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై తన నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

అరికెపూడి ఇంటి వద్దనే పంపిణీ

మరోవైపు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చెక్కులను తన ఇంటి వద్దకే తీసుకురావాలని హుకుం జారీ చేయగానే మండల అధికారులు చెక్కులతో ఆయన ఇంటికి పరుగెత్తారు. లబ్ధిదారులకు చెక్కుల పంపిణీని ఆయన ఇంటి వద్దనే ఆయన చేతుల మీదుగా పంపిణీ చేయించారు. అధికారికంగా నిర్వహించే కార్యక్రమాలలో ఎమ్మెల్యేలందరికీ ఒకే విధమైన ప్రొటోకాల్ పాటించాల్సిన అధికారులు ఇలా ఒక ఎమ్మెల్యే విషయంలో ఒకవిధంగా.. మరొకరి విషయంలో వేరేవిధంగా ప్రొటోకాల్ పాటించడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై కూకట్‌పల్లి తాసీల్దార్ స్వామిని వివరణ కోరగా..ఎమ్మెల్యే గాంధీ ఇంటివద్ద అధికారులతో కలిసే లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారని, కొన్ని చెప్పలేని ఇబ్బందులు ఉన్నాయని అంటూ సమాధానం దాటవేశారు.

ఫిబ్రవరిలో 'వేవ్స్'కు భారత్ ఆతిథ్యం

సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : వచ్చే ఏడాది ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్మెంట్ సదస్సు (WAVES-వేవ్స్)కు భారత ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వనున్నట్టు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(జేఎన్ఏఎఫ్ఏయూ)ఆడిటోరియంలో శుక్రవారం వేవ్స్ ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. దేశ మీడియా, ఎంటర్‌టైన్మెంట్ పరిశ్రమను బలోపేతం చేయడానికి, ఆ రంగానికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకొచ్చేందుకు వేవ్స్‌ను నిర్వహించనున్నట్టు చెప్పారు. వేవ్స్.. భారత్‌ను మీడియా ఎంటర్‌టైన్మెంట్(ఎంఈ) రంగంలో అపరిమితమైన గ్లోబల్‌శక్తిగా నిలపబోతుందని ధీమా వ్యక్తం చేశారు. 'క్రియేట్ ఇన్ ఇండియా' చాలెంజ్ వేవ్స్ సీజన్-1 ప్రారంభమైందని, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

తాసీల్దార్లను పూర్వపు జిల్లాలకు బదిలీ చేయాలి

రెవెన్యూ మంత్రి పొంగులేటికి ట్రెసా విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల సందర్భంగా బదిలీ చేసిన తాసీల్దార్లు, డిప్యూటీ తాసీల్దార్లను పూర్వపు జిల్లాలకు బదిలీ చేయాలని ట్రెసా(తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్) బాధ్యులు ప్రభుత్వాన్ని కోరారు. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్ శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని 150 మంది తాసీల్దార్లు, డిప్యూటీ తాసీల్దార్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను వివిధ ప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ చేశారని, తిరిగి వారిని పూర్వపు జిల్లాలకు పంపించాలని మంత్రికి విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ట్రెసా రాష్ట్ర ఉపాధ్యక్షులు కే నిరంజన్, బాణాల రాంరెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల అధ్యక్షులు రమణ్ రెడ్డి, చంద్రశేఖర్, మధుకర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వాహన చట్టం నిబంధనలపై వివరణ ఇవ్వండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): 2019లో సవరించిన మోటరు వాహన చట్టం నిబంధనల అమలుపై పూర్తి వివరాలు సమర్పించాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రాష్ట్రంలో ఈ నిబంధనలను అమలు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. వాహన రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సుల జారీతో పాటు రవాణా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించిందని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించేవారికి కఠిన శిక్షలు విధించాలని కొత్త నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని, అయితే ఆ నిబంధనల నిబంధనల అమలుపై నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలేసిందని వివరించారు. దీంతో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

ఎఫ్‌టీఎల్‌ను ఎలా నిర్ణయిస్తారు?

- అందుకు విధానాలేమిటి?
- నిబంధనలుంటే సమర్పించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): చెరువుల పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిని ఎలా నిర్ణయిస్తారో చెప్పాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎఫ్‌టీఎల్‌ను నిర్ణయించేందుకు చట్టపరమైన నిబంధనలు గానీ, ప్రభుత్వ విధానాలు గానీ ఏమైనా ఉంటే సమర్పించాలని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్‌ను 160 ఎకరాలుగా ఏ ప్రాతిపదికన నిర్ణయించారో కూడా చెప్పాలని కోరింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టబేగంపేట గ్రామం సర్వే నంబర్ 47లోని అమర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఉన్న తన ప్లాట్‌లోని నిర్మాణాల్లో జోక్యం చేసుకోకుండా ఆదేశాలివ్వాలంటూ ఎల్ ఊర్మిళాదేవి అనే మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె శ్రీనివాసరావు ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. నీటిపారుదల శాఖ మ్యాప్ ప్రకారం దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ 65 ఎకరాలు మాత్రమే ఉన్నప్పటికీ అధికారులు 160 ఎకరాలు ఉన్నట్టు చెప్తున్నారని, దీనివల్ల ప్రైవేట్ ఆస్తులన్నీ అందులోకి వస్తున్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రైవేటు భూమి ఏమైనా ఉన్నట్టయితే భూసేకరణ చట్టం కింద ఆ భూమిని సేకరించాలని వివరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ఎలాంటి చట్టం అమలులో లేని పక్షంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రామాణికమవుతుందని వ్యాఖ్యానించింది. ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు అనుసరించే పద్ధతులు, నిబంధనలు ఏవైనా ఉంటే చెప్పాలని ప్రభుత్వాని ఆదేశించింది. ఒకవేళ లేని పక్షంలో మార్గదర్శకాలు జారీచేసే అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది.

రాష్ట్రంలో 3 రోజుల పాటు భారీ వర్షాలు

21 నుంచి 24వరకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. వాగులు, వంకలు ఉన్న ప్రాంతాల్లోనివారు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. 21న నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. 22న ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, సిరిసిల్ల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్